నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

- కాలువలో నీటి ప్రవాహం లేక సాగుకు ఇక్కట్లు
- 600 ఎకరాలకు అందని సాగునీరు
- శివారు పొలాల రైతుల అవస్థలు వర్ణనాతీతం
- బోర్ల ద్వారా వచ్చే నీరే ఆధారం



ఉసులుమర్రులో వినియోగంలో లేని ఎత్తిపోతల పథకం

పెరవలి: పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా సాగు నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువపై కానూరు అగ్రహారం, ఉసులుమర్రుకు చెందిన పంట భూములకు సాగు నీరు అందడం లేదు. సాగునీటి కోసం ఉసులుమర్రులో ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసినా అది కూడా నిరుపయోగంగానే ఉంది. దీనితో 600 ఎకరాలకు సాగునీరు అందక రైతులు పడే పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. రైతుల దుస్థితిని చూసి అప్పటి నర్సాపురం ఎంపీ యూవీ కృష్ణంరాజు ఎంపీ నిధుల నుంచి రూ.7.50 లక్షలు కేటాయించడంతో మురుగు కోడుపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

మొరాయించిన పంపింగ్ స్కీమ్ మోటార్లు

ఈ పథకం నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకపోయినా ఇరిగేషన్ అధికారులు నాలుగేళ్లపాటు ఒక ఉద్యోగిని నియమించి సాగు నీటికి ఆటంకం లేకుండా పథకాన్ని కొనసాగించారు. తరువాత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా దీనిని నిర్వహించడం మొదలుపెట్టారు. కాలక్రమేణా పంపింగ్ స్కీమ్‌లో మోటార్లు మొరాయించడంతో వాటి మరమ్మతులకు నిధులు లేకపోవడంతో రైతులు దీని నిర్వహణపై చేతులెత్తేశారు. పేరుకే కానూరు కాలువ ఉంది తప్ప చుక్కనీరు కూడా శివారు భూములకు అందడం లేదంటూ రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. లక్షలు పోసి ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారడంతో అందులో అమర్చిన మోటార్లు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి.

రైతుల ఫిర్యాదులు బుట్టదాఖలు

రైతులకు సాగునీరు సక్రమంగా అందించలేని రెవెన్యూ అధికారులు పన్ను వసూళ్లకు మాత్రం వస్తున్నారని, నీరు లేనప్పుడు పన్ను ఎందుకు కట్టాలని రైతులు ప్రశ్నిస్తే పండించిన పంటపై జెండాలు పాతుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పన్ను రద్దు చేయమని గ్రామస్తులందరూ సామూహికంగా ప్రభుత్వం నిర్వహించే ప్రతి సమావేశంలో రైతులకు ఫిర్యాదులు చేసినా అవి బుట్టదాఖలు చేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని పలువురు ధ్వజమెత్తుతున్నారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా ఉసులుమర్రు శివారు వరకు వచ్చే కాలువ ద్వారా సాగు నీరు అందక 600 ఎకరాల రైతులు అగచాట్లు పడుతూ సొంతంగా బోర్లు వేసుకుని సాగు చేసుకుంటున్నారు. చిన్న, సన్నకారు రైతులు బోర్లు ఉన్న రైతులు ఇచ్చే నీటితోనే పంటలు పండించుకోవాల్సి వస్తోంది. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందితే పంట భూములు కళకళలాడుతూ ఉండేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా కానూరు కాలువలో కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాల డ్రెయినేజీలు కలిపివేయటంతో కాలువ స్వరూపమే మారిపోయింది. మురుగు కాలువగా నేడు దర్శనమిస్తోంది.

సాగుకు అవస్థలు పడుతున్నాం



ఎత్తిపోతల పథకం ఉన్నా దానిని వినియోగించక రైతులకు సాగు నీరు అందడం లేదు. దీంతో ఏటా సాగుకు అవస్థలు పడుతున్నాం. మొదటి పంట ముంపు బారిన పడుతుంటే, రెండవ పంటకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం.

– తాతా మంగారావు, కౌలు రైతు, ఉసులుమర్రు

మురుగునీరు పారుతోంది



కానూరు చానల్ కాలువ ఉన్నా ఎందుకూ ఉపయోగం లేదు. కాలువ శివారు భూములకు సాగు నీరు అందదు. కాలువలో పారుతోంది నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు తప్ప మరొకటి కాదు. రైతులకు రెండవ పంటకు సాగునీరు అందడం లేదు.

– పిప్పిర దుర్గారావు, రైతు, ఉసులుమర్రు



ఎత్తిపోతల నీటి కుండీపై పెరిగిన తప్పలు



చుక్క నీరు అందించని కానూరు కాలువ



ఉసులుమర్రులో కానూరు కాలువలో మురుగునీరు

క్లుప్తంగా

వాటర్ ప్లాంటు పునరుద్ధరణ అభినందనీయం



కొవ్వూరులో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ తదితరులు

కొవ్వూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ప్లాంటు పునరుద్ధరణకు వాసవీ క్లబ్ చర్యలు తీసుకోవడం అభినందనీయమని వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ కాకి అనిల్ సూర్య పేర్కొన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఎదురుగా ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ప్లాంటు మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో వాసవీ క్లబ్ ద్వారా మన్యం ఎలక్ట్రానిక్స్ అధినేత మన్యం వీరభద్ర గుప్తా ఆర్థిక సహకారంతో నీరు తోడేందుకు మోటారు ఏర్పాటు చేసి, ప్లాంటును పునరుద్ధరించారు. నూతనంగా పునరుద్ధరించిన ప్లాంటును అనిల్ సూర్య మంగళవారం ప్రారంభించారు. వాసవీ క్లబ్ నాయకులు వలివేటి ప్రసాద్, దేవతు కృష్ణ ప్రసాద్, వాసవీ క్లబ్ కార్యదర్శి సత్యవరపు గురునాథ్, కోశాధికారి సత్యవరపు భరత్, తీగెల రవికుమార్, రాఘవ రమాకాంత్, వల్లాల నాగబాబు, చెక్క సూర్య గౌతమ్ పాల్గొన్నారు.

గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని పునరుద్ధరించాలి



తాళ్లపూడిలోని గౌతమేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రాధామనోహర్‌దాస్

తాళ్లపూడి: తాళ్లపూడిలోని గోదావరి గట్టు సమీపంలోని అతిపురాతనమైన గౌతమేశ్వర స్వామి జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పూర్వ వైభవం తీసుకురావాలని హిందూ ధర్మ ప్రచారకులు రాధామనోహర్ దాస్ అన్నారు. మంగళవారం తాళ్లపూడి విచ్చేసిన రాధామనోహర్‌దాస్ గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, దాతలు అందరూ కలిసికట్టుగా నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఆయనకు కవల శ్రీను, పరస రాధాకృష్ణ తదితరులు ఆలయాన్ని వీలైనంత త్వరగా అభివృద్ధి చేయాలని కోరారు.

మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సలీం ఎంపిక



మల్లిపూడి సలీం (ఫైల్)

గోపాలపురం: గోపాలపురం మండల వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గోపవరానికి చెందిన మల్లిపూడి సలీంను ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు వెలగా రత్నశ్రీ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వ్యక్తులను గుర్తించడంలో వైఎస్సార్ సీపీ ముందు వరుసలో ఉంటుందని అందుకు తనకు మండల పార్టీ అధ్యక్షుడి బాధ్యతలకు ఎంపిక చేయడమేనని మల్లిపూడి సలీం అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత, మండల పార్టీ సీనియర్ నాయకులకు సలీం కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన డీజిల్ పట్టివేత

గోపాలపురం: గోపాలపురం గ్రామ శివార్లలో కొందరు అనధికారికంగా డీజిల్, నల్ల ఆయిల్ విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించామని జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్ నాగాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివార్లలో అనధికార వ్యక్తులు కొంతమంది సేకరించిన 750 లీటర్ల డీజిల్, 2,610 లీటర్ల బ్లాక్ ఆయిల్‌ను గోపాలపురం సివిల్ సప్లై డీటీ కె.దివాకర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి వాటిని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు.

మదన గోపాలస్వామి ఊరేగింపు



తాడిపర్రులో మదన గోపాలస్వామి ఊరేగింపు

ఉండ్రాజవరం: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తాడిపర్రు, ఉండ్రాజవరం, మోర్త, వేలివెన్నులోని రుక్మిణి, సత్యభామ సమేత గోపాలస్వామి వార్ల ఊరేగింపు వాయిద్యాల నడుమ మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

నేడు దక్షిణ మధ్య రైల్వే జీఎం పర్యటన

నిడదవోలు : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నిడదవోలు రైల్వేస్టేషన్‌లో పర్యటించనున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను ఆయన పరిశీలించనున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా ఎంపికైన నిడదవోలు రైల్వేస్టేషన్‌లో చేపట్టిన స్టేషన్ విస్తరణ, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించనున్నారు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టుతో పాటు నిడదవోలు–భీమవరం పాసింజర్ రైలు పునరుద్ధరణ వంటి సమస్యలను జీఎం దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రాలు అందించేందుకు పలువురు సంసిద్ధమవుతున్నారు.

అనాథాశ్రమంలో అన్నసమారాధన

నిడదవోలు : తిమ్మరాజుపాలెం లయన్స్ అనాథాశ్రమంలో నిడదవోలు మానవతా సంస్థ ఆధ్వర్యంలో దాతలు వెంట్రాప్రగడ లక్ష్మీభాగ్యవతి ఆర్థిక సహకారంతో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత సంఘ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, కార్యదర్శి ముళ్ళపూడి సోమరాజు, కోశాధికారి పెనుగొండ సుబ్బారావు, నీలం రామారావు, ఉన్నమట్ల సత్యభాస్కర్, ప్రసాద్, కుందుల ప్రభాకరం, ఏవీ రమణ, షేక్ హైదర్‌భాషా, వెంకటరావు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో యువతను మోసగించిన చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం
- నేడు కొవ్వూరులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



కొవ్వూరులో యువత పోరు పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

కొవ్వూరు: నిరుద్యోగులకు నెలకి రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అబద్ధపు హామీలతో చంద్రబాబు యువతను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆరోపించారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని యువత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకి వచ్చిన దశలో ఫీజులు చెల్లించాలని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు అందకపోవడంతో విద్యార్థులకు ఫీజుల చెల్లింపు గుదిబండగా మారిందన్నారు. 2004లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఈసారి కూడా కల్లబొల్లి కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. గడిచిన పదినెలల కాలంలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన అన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంటు పథకం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు అండగా నిలిచారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు పథకానికి, నిరుద్యోగ భృతికి చంద్రబాబు సర్కారు కనీసం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా యువతను మరోసారి మోసం చేసిందన్నారు. యువత, నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్ సీపీ 12వ తేదీ బుధవారం రాజమహేంద్రవరంలో కలెక్టర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో చలో రాజమహేంద్రవరం– యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులంతా తరలిరావాలని కోరారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో మేలు చేకూరిందని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, గొరిజాల పేర్రాజు, మెరిపో వీర్రాజు, చొప్పా అప్పలనాయుడు, పరిమి సోమరాజు, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, చిట్టూరి అన్నవరం, అంకోలు వెంకటలక్ష్మిపద్మలీల, దేవగుప్తాపు ఛాందిని పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



చాగల్లులో యువత పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు : కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని, వైఎస్సార్‌సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. చాగల్లులో శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం వద్ద యువత పోరు కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే ఇంటికో ఉద్యోగం ఇస్తామని యువతను, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని విద్యార్థులను నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన ఏ హామీని ఇంతవరకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. బడ్జెట్లో కేటాయించిన నిధులకు.. ఎన్నికల హామీలకు పొంతన లేదన్నారు. హామీలు ఇచ్చినప్పుడు వాటిని అమలు చేసేందుకు ఇంత బడ్జెట్ అవుతుందని, రాష్ట్ర బడ్జెట్‌పై అవగాహన లేకుండా హామీలు ఎలా ఇచ్చారని ధ్వజమెత్తారు. ఇప్పుడు హామీలు అమలు చేయడంపై కూటమి నాయకులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు సర్కారు మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై గళ మెత్తాల్సిన సమయం ఆసన్నమైందని, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాజమండ్రి కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, మండల పార్టీ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, కంఠమణి రమేష్, పిల్లి తిరుమలరావు, మేకా రాజు, కుదప రాంబాబు, మట్టా వెంకట్రావు, ఎల్లే నాగేశ్వరరావు, బొర్రా కృష్ణ, ఉండవల్లి శ్రీనివాస్, జాలెం వెంకట్రావు, ఉన్నమట్ల బ్రాహ్మానందం, ఇంటి వీర్రాజు, పిండి మంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష

ఉండ్రాజవరం: గన్నమని శేషగిరిరావు ప్రతిభా పాటవ పరీక్ష మంగళవారం ఉండ్రాజవరం ప్రాథమిక పాఠశాల–1లో నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని ప్రభుత్వం పాఠశాలల్లోని 5వ తరగతి చదివే విద్యార్థులు 75 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో శారదా జ్యోత్స్న సందర్శించారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు

నల్లజర్ల: నాలుగేళ్లగా సమాచార హక్కు చట్టమంటూ పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను వేధిస్తున్న నిడమర్రుకి చెందిన సంకెళ్ల రాంబాబుపై చర్యలు తీసుకోవాలని మండలంలోని 24 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఆయా పంచాయతీల్లో జమ, ఖర్చుల వివరాలు కావాలని ఇవ్వకుంటే సోషల్ మీడియాలో అల్లరి చేస్తానంటూ రాంబాబు, దుర్గ అనే మహిళ కార్యదర్శులు, సిబ్బందికి ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం నల్లజర్ల పంచాయతీకి మండలంలోని అన్ని పంచాయతీల నుంచి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు వారంతా పోలీసులకు వివరించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సీఐ విజయశంకరం అన్నారు.

ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నిడదవోలు : టీడీపీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తామన్న అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ – వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ రద్దుకు కార్మికులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆప్కాస్ రద్దు చేయడం వల్ల 1.20 మందికి నష్టం జరుగుతుందన్నారు. జీవో 2ను సవరించి అందరికీ పనికి తగ్గ వేతనం వర్తింపజేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి ఆయా శాఖల ద్వారా నేరుగా జీతాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బొచ్చా సాయిరమణ, ధనాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీ



కొవ్వూరులో మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేసిన లయన్స్ జిల్లా గవర్నర్ వేణుబాబు



పాలంగిలో ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ శ్రీనివాసు

కొవ్వూరు: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కొవ్వూరు లయన్స్ క్లబ్ పనిచేస్తుందని జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు సూచించారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పర్యటనలో భాగంగా మంగళవారం పట్టణంలో ఆరుగురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీరవెంకటసత్యనారాయణ, కార్యదర్శి నామన బుల్లిరాజు, సభ్యులు పాలెంపాటి చినబాబు చౌదరి, పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని, కంఠమణి రామకిషోర్, మన్యం బుల్లిబాబు, యనమదల సుబ్రమణ్యం, ఎండీ హుస్సేన్, కలగర వెంకట్రావు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ

ఉండ్రాజవరం: టైలరింగ్‌లో ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బి. శ్రీనివాసు అన్నారు. మండలంలో పాలంగి ప్రాథమిక పాఠశాల ఆవరణలో బైర్రాజు ఫౌండేషన్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 90 రోజుల ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ నోడల్ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాసు మాట్లాడుతూ ప్రస్తుతం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు శిక్షణలో సుమారు 40 మంది మహిళలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ, భాను, రమేష్, డ్వాక్రా సీఏ రాణి, వెంకటలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు మధు, శరత్ పాల్గొన్నారు.

తూర్పుచోడవరం హైస్కూలు హెచ్‌ఎం మృతి



జీఎస్‌వీ రవికుమార్ (50)

నల్లజర్ల: తూర్పుచోడవరం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం జీఎస్‌వీ రవికుమార్ (50) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం చాటపర్రులో బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. ఐదేళ్లుగా ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఆయన పనిచేస్తున్నారు. విషయం తెలిసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ సంతాప సభ నిర్వహించారు. అనంతర ఎంఈఓ భగవతి, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, తూర్పుచోడవరం హైస్కూలు ఉపాధ్యాయులు చాటపర్రులో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వైభవంగా మదన గోపాలుడి రథోత్సవం



తాళ్లపూడి మెయిన్ రోడ్డులో ఉత్సాహంగా రథాన్ని లాగుతున్న గ్రామస్తులు, మహిళలు



హరేశ్రీనివాస బృందం కోలాట ప్రదర్శన

తాళ్లపూడి: తాళ్లపూడిలోని పురాతనమైన వివాహాల దేవుడు, సంతాన మదన గోపాలుడిగా ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలుడి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా మేళతాళాలతో, హరే శ్రీనివాస కోలాటం, డప్పు వాయిద్యాలతో రథయాత్ర సాగింది. సర్పంచ్ నక్కా అనురాధ, నక్కా చిట్టిబాబు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా రథాన్ని అగ్నికుల క్షత్రీయులు లాగారు. రథం వెళ్లేటప్పుడు మహిళలు నీళ్లు, పువ్వులు చల్లి, హారతులిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు పరస రాధాకృష్ణ మాట్లాడుతూ రథోత్సవంలో పాల్గొనడం, రథాన్ని దర్శించుకోవడం ద్వారా సర్వ పాపాలు, నిర్మూలన అవుతాయన్నారు. ఉదయం రాధామనోహర్ దాస్ ప్రవచనం వినిపించారు. ఈ కార్యక్రమంలో రాధామనోహర్ దాస్, ఇస్కాన్ ప్రతినిధులు, గ్రామస్తులు సింహాద్రి జనార్దనరావు, గోకవరపు సూరిబాబు, సొలస ఉమ, గోకవరపు మాణిక్యం, కంకిపాటి సాయి, వినయ్, నిలి శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో మార్పులపై పునరాలోచించాలి



నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంక జయలక్ష్మి

నల్లజర్ల: ప్రాథమిక విద్యావిధానంలో ప్రభుత్వం తీసుకున్న 5 రకాల బడుల ఏర్పాటు చేయాలన్న విధాన నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల పరిషత్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈఓ–2 భగవతి విద్యాశాఖ ప్రగతిని సభకు వివరిస్తుండుగా ప్రాథమిక విద్యావిధానంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్నాయని పునరాలోచన చేయాలని ఆవపాడు, ప్రకాశరావుపాలెం, తెలికిచెర్ల సర్పంచ్‌లు అచ్యుత సత్యనారాయణ, జాన్‌విక్టర్, బండి చిట్టీ విజ్ఞప్తి చేసారు. ఆవపాడులోని యూపీ పాఠశాలను రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని వైఎస్ ఎంపీపీ అచ్యుత శివాజీ కోరారు. ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎంఈఓ వివరించారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశరావుపాలెం–తూర్పుచోడవరం రహదారి 5 కి.మీ మేర అభివృద్ధికి రూ.3 కోట్లు, ప్రకాశరావుపాలెం–తెలికిచెర్ల 3.5 కి.మీ రహదారి అభివృద్ధికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. తూర్పుచోడవరం–గుండేపల్లి 3కి.మీ, అనంతపల్లి–కవ్వులూరు 5 కి.మీ రహదారి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేసినట్టు చెప్పారు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో రూ.6.14కోట్లతో చేపట్టిన సీసీ రహదారులు, డ్రెయిన్ల పనులు దాదాపు పూర్తికావచ్చాయన్నారు. వ్యవసాయాధికారి కమల్‌రాజ్ మాట్లాడుతూ ఈసారి 20వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు తీసుకురావాలని సభ్యులను కోరారు. ఎంపీడీఓ సింహాద్రి, వైద్య, ఆరోగ్యశాఖ తరపున సీహెచ్‌ఓ ప్రసాదరావు, రెవెన్యూశాఖ తరపున డీటీ శాంతిప్రియ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అజయ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈలు బాపిరాజు, యం.రమణ, ఉపాధిహామీ పథకం ఏపీఓ వెంకట్రావు, ఐకేపీ తరపున ఏఓ శ్యాంసుందర్, ఎంఈఓ వై.సత్యనారాయణ తమ నివేదికలు సభకు సమర్పించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.